విద్యతోనే ఉజ్వల భవిత



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నదని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్‌ గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని 16వ డివిజన్‌ ఇన్‌చార్జీ టింకు రెడ్డితో కలిసి పరిశీలించారు. భోజనంలో నాణ్యత ఇతరత్రా అంశాలపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిల్లలకు భోజనం విషయంలో ఎటువంటి లోటు లేకుండా మంచి భోజనం అందేలా చూస్తామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. విద్యతోనే ఎవరికైనా ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకొని ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

శంషాబాద్‌ రూరల్‌: జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను బుధవారం జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు పరిశీలించారు. మండలంలోని ఒయాసిస్‌ పాఠశాలలో ఈ నెల 29, 30వ తేదీల్లో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో డీఈఓ సమీక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఐటీ శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్‌బాబు చేతులమీదుగా కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మణ్‌నాయక్‌, కృష్ణ, జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న ఇంచార్జ్‌ ఈశ్వర్‌

మైలార్‌దేవ్‌పల్లి: సాంకేతిక విద్యలో భాగంగా మైలార్‌దేవ్‌పల్లిలోని శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో 2024–25వ విద్యా సంవత్సరానికిగాను నేషనల్‌ స్పేస్‌ సెటిల్‌మెంట్‌ కంటెస్టెడ్‌లో పాల్గొనే విద్యార్థులకు బుధవారం నాసా కిట్లను అందజేశారు. అనంతరం నాసా కార్యక్రమ ఇంచార్జ్‌ ఈశ్వర్‌ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించాలన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సజనాత్మకత ఉంటుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులలో సాంకేతికతను పెంపొందించడానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ సుజాతాసెబాస్టియన్‌, డీన్‌ బి.శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాక్‌ పార్లమెంట్‌తో సమకాలిన పరిస్థితులపై అవగాహన



మాక్‌ పార్లమెంట్‌ విద్యార్థినులు

గోల్కొండ: మాక్‌ పార్లమెంట్‌ కార్యక్రమాలతో విద్యార్థులకు సమకాలిన పరిస్థితులపై అవగాహన కలుగుతుందని తెలంగాణ గవర్నర్‌ డిప్యూటీ సెక్రటరీ జి.పల్లవి అన్నారు. బుధవారం షేక్‌పేట్‌ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాలలో మాక్‌ పార్లమెంట్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది విద్యార్థినులు ఎంపీలు, మంత్రులు, స్పీకర్‌లుగా హుందాగా ఎలా వ్యవహరించాలో చక్కగా కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రతిపక్షంగా ఉన్న వారు అధికారంలో ఉన్న వారిని ప్రజా సమస్యలపై చక్కగా నిలదీస్తు తమలోని వాగ్ధాటిని నిరూపించుకున్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు తిప్పికొట్టడం తమకు మంచి నీరు తాగినట్లే అని మాక్‌ పార్లమెంట్‌లోని మంత్రులు సరైన జవాబులు ఇస్తు తమలోని సత్తాను చాటుకున్నారు. అయితే మాక్‌ పార్లమెంట్‌కు స్పీకర్‌గా వ్యవహరించిన విద్యార్థిని పార్లమెంట్‌లో తన స్థానం ఏమిటో నిరూపిస్తు కొందరిని పార్లమెంట్‌ నుంచి సస్పెండ్‌ చేస్తూ మరికొందరిని బౌన్సర్లచే బయటకు పంపుతూ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జి.పల్లవి మాక్‌ పార్లమెంట్‌ నిర్వహణను ఎంతగానో మెచ్చుకుంటూ మాక్‌ పార్లమెంట్‌లోని సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం పార్లమెంట్‌లోని ఉభయ సభల పాత్ర తదితర విషయాలు కళాశాల విద్యార్థినులు బాగా అర్థం చేసుకున్నారని అన్నారు. భారత రాజ్యాంగం భారతీయులకు వరం లాంటిదని ఆమె అన్నారు. మన ప్రజాస్వామ్య మూల స్తంభాలను విద్యార్థులు తెలుసుకొని, పౌరసత్వ బాధ్యతలను సైతం అర్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ రమేష్‌రెడ్డి, డాక్టర్‌ ఏ.మాధవిలత, డాక్టర్‌ టి.అనురాధా, నీలం దుర్గాభవానీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం మాక్‌ పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

సర్వే వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం

- కొనసాగుతున్న డాటా ఎంట్రీ పనులు
- ఈ నెల 30లోపు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు



సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది



సమగ్ర వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

శంషాబాద్‌ రూరల్‌: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసే కార్యక్రమం మండలంలో చురుగ్గా కొనసాగుతోంది. 21 పంచాయతీల పరిధిలో చేపట్టిన సర్వేలో 11,022 ఫారాల్లో వివరాలు సేకరించారు. ఈ నెల 23 నుంచి డాటా ఎంట్రీ చేపట్టారు. ఇందుకోసం వర్ధమాన్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో 50 మంది ఆపరేటర్ల సాయంతో వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నారు. ఎలాంటి తప్పులు లేకుండా నమోదు వివరాలను ఎన్యుమరేటర్లు దగ్గరుండి చూసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 40 శాతం ఫారాల వివరాలు ఎంట్రీ అయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 30వ తేదీలోపు ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా ఎంపీఓ ఉషాకిరణ్‌ వెల్లడించారు.

మిగిలిన వారు కార్యాలయంలో సంప్రదించాలి...

ఇంటింటికీ తిరిగి చేపట్టిన సర్వేలో మిగిలిన వారు ఎవరైనా ఉంటే మండల పరిషత్‌ కార్యాలయంలో సంప్రదించి వివరాలు ఇవ్వాలని ఎంపీడీఓ మున్నీ సూచించారు. మండలంలో పది మంది సూపర్‌ వైజర్‌ల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇందు కోసం వంద మంది చొప్పున ఎన్యుమరేటర్లు, ఈబీఎస్‌ సిబ్బంది సర్వేలో పాల్గొన్నారు.

సర్వే సూపర్‌వైజర్లతో సమావేశం

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే సూపర్‌వైజర్లతో సర్కిల్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌ బుధవారం సమావేశమయ్యారు. సమావేశంలో బుధవారం వరకు నిర్వహించిన సర్వే వివరాలు, లోటుపాట్లు తదితర వాటిపై చర్చించారు. గతంలో ఎన్యుమరేటర్లు ఇంటికి వెళ్లిన సమయంలో తాళాలు వేసి ఉన్న వారి డాటాను పరిశీలించారు. మరోసారి వారి ఇళ్లకు వెళ్లి సర్వే పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను సర్కిల్‌ కార్యాలయంలో భద్రపరిచినట్లు తెలిపారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్‌: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజేంద్రనగర్‌ విద్యుత్‌ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు. యూనివర్సిటీ, చింతల్‌మేట్‌, సులేమాన్‌నగర్‌, ఫహడీ, బాసిత్‌ బాబానగర్‌, జలాల్‌ బాబానగర్‌, ఉప్పర్‌పల్లి విద్యుత్‌ ఫీడర్ల పరిధిలోని రాజేంద్రనగర్‌, ఉప్పర్‌పల్లి, బుద్వేల్‌, గోల్డెన్‌ సిటీ, డైమండ్‌ సిటీ, బెస్ట్‌ ఫ్రైజ్‌, ఖాద్రీ హిల్స్‌, శ్రీదేవి కాలనీ, వాదే సులేమాన్‌నగర్‌, అక్బర్‌ హిల్స్‌, ఖాజా హస్టల్‌, చింతల్‌మేట్‌, బాసిత్‌బాబానగర్‌, గోల్డెన్‌ హైట్స్‌ కాలనీ, ఇమాద్‌నగర్‌, ఖయ్యూంనగర్‌, షరీఫ్‌ గార్డెన్‌, హాజీ గార్డెన్‌, చస్మా, జనచైతన్య పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపివేస్తామన్నారు.

- శివరాంపల్లి పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌ అధికారులు తెలిపారు. యూనివర్సిటీ, చింతల్‌మేట్‌, సులేమాన్‌నగర్‌, ఫహడీ, బాసిత్‌ బాబానగర్‌, జలాల్‌ బాబానగర్‌, ఉప్పర్‌పల్లి విద్యుత్‌ ఫీడర్ల పరిధిలోని గోల్డెన్‌ సిటీ, డైమండ్‌ సిటీ, బెస్ట్‌ ఫ్రైజ్‌, ఖాద్రీ హిల్స్‌, శ్రీదేవి కాలనీ, వాదే సులేమాన్‌నగర్‌, అక్బర్‌ హిల్స్‌, ఖాజా హాస్టల్‌, చింతల్‌మేట్‌, బాసిత్‌ బాబానగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపివేస్తామని అధికారులు వివరించారు.

మహిళ అదృశ్యం



కన్నం సువర్ణ

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైంది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి ఓల్డ్‌ విలేజ్‌ హనుమాన్‌ టెంపుల్‌ సమీపంలో ఉండే కన్నం సువర్ణ(55)కు బ్రెయిన్‌ ఆపరేషన్‌ కావడంతో మతి స్థిమితం సరిగా ఉండదు. ఆమె కుమారుడు రఘువీర్‌ తల్లిని ఇంటి నుంచి బయటకి వెళ్లకుండా చూసుకుంటున్నాడు. ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం తల్లి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రఘువీర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ ఏర్పాటు



మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు సురక్షిత నీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఆ దిశగా తగు ఏర్పాట్లు చేస్తున్నామని ధార స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌ కుమారుడు వి.రేవంత్‌ అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ గణేష్‌ నగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సంస్థ ద్వారా రూ. 1.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి నీటి సదుపాయం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆయా ఇబ్బందులను తొలగించేందుకే తాము వారు సురక్షిత నీరు తాగేలా ఆర్‌వో ప్లాంటును ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులతో పాటు వారి ఆరోగ్య సంరక్షణ కూడా పాఠశాలకు ఎంతో అవసరమని ప్రధానోపాధ్యాయులు మాధవి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యంరెడ్డి, లక్ష్మీబాయి, జోత్స్న, శిరీష, అనూష, కంప్యూటర్‌ ఆపరేటర్‌ రేష్మ తదితరులు పాల్గొన్నారు.

'రైతుల పండగ'ను విజయవంతం చేయండి

మణికొండ: మహబూబ్‌నగర్‌ జిల్లా అమిస్తాపూర్‌లో గురువారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల పండగను నిర్వహించనుందని నార్సింగి మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ వేణుగౌడ్‌ తెలిపారు. రైతు పండగకు అన్ని రంగాల రైతులు దీనికి తరలివెళ్లాలని ఆయన కోరారు. మూడు రోజుల పాటు అనేక రైతు ప్రదర్శనలు ఉంటాయన్నారు. వాటిని తిలకిస్తే ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానం వస్తుందన్నారు. గండిపేట, శంషాబాద్‌ మండలాల పరిధిలోని రైతులు పెద్ద ఎత్తున తరలివెళ్లాలని ఆయన పేర్కొన్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

రాజేంద్రనగర్‌: బుద్వేల్‌ టీచర్స్‌ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో ఈ నెల 29వ తేదీన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించనున్నారు. కార్తీక మాసంలో ఆఖరి శుక్రవారం నేపథ్యంలో సాయంత్రం 6 గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతాలతోపాటు లలిత సహస్రనామ పారాయణం, అమ్మవారికి కుంకుమార్చన, కార్తీక దీపాలంకరణ, అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని దేవాలయం చైర్మన్‌ అండ్‌ ఫౌండర్‌ కోరని శ్యామ్‌ తెలిపారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.

వృత్తిపరమైన శిక్షణ అవసరం

మనూ వీసీ ప్రొ.ఐనుల్‌ హసన్‌

రాయదుర్గం: ప్రభావవంతమైన విద్యా విషయాలను రూపొందించడంలో వృత్తిపరమైన శిక్షణ అవసరమని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్ట్రక్షనల్‌ మీడియా సెంటర్‌(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్‌ న్యూస్‌ బులిటిన్‌పై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఐఎంసీ డైరెక్టర్‌ డాక్టర్‌ రిజ్వాన్‌ అహ్మద్‌ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్‌ యుగంలో నాణ్యమైన విద్య అవసరమన్నారు. అనంతరం రిసోర్స్‌ పర్సన్లు ఐఎంసీలో నిర్మాత–1 ముజాహిద్‌ అలీ, డాక్టర్‌ అస్లామ్‌ పర్వేజ్‌, డాక్టర్‌ ముస్తఫా అలీ సర్వరీ, ఎండీ అమీర్‌ బాదర్‌లు న్యూస్‌ రైటింగ్‌, ఎడిటింగ్‌, ప్రొడక్షన్‌ గురించి వివరించారు. అనంతరం మనూ రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ ఇష్తియాక్‌ అహ్మద్‌ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

శంషాబాద్‌ రూరల్‌: శంషాబాద్‌–షాబాద్‌ రహదారి విస్తరణ పనులకు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ బుధవారం శంకుస్థాపన చేశారు. ఒయాసిస్‌ పాఠశాల నుంచి సర్కాడ శివారులోని ఆంజనేయ స్వామి దేవాలయం వరకు సుమారు 2.2 కిలోమీటర్ల దూరం వరకు రహదారిని విస్తరించనున్నారు. రూ. 18 కోట్ల నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

రాజేంద్రనగర్‌: శివరాంపల్లి ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న నిర్మాణాలపై స్థానికులు బుధవారం హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ను కలిసి వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు జీవన్‌దాస్‌, ప్రభాకర్‌ రెడ్డిలు విలేకరులతో మాట్లాడుతూ... శివరాంపల్లి సర్వే నంబర్‌ 23లో ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఇందులోని 500 గజాల స్థలాన్ని ఆక్రమించి ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. గతంలో నిర్మాణాలు చేపట్టగా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు కూల్చివేశారన్నారు. ప్రస్తుతం ఫిర్యాదు చేసినా తహసీల్దార్‌ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతూ హైడ్రా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వారు వెల్లడించారు.

సందడిగా కార్తీక వనభోజనాలు



ఉసిరి చెట్టుకు పూజలు చేసిన మహిళలు

మణికొండ: కార్తీక మాసం సందర్భంగా బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలో మహిళలు బుధవారం కార్తీక వనభోజనాలను సందడిగా నిర్వహించారు. బోటానికల్‌ గార్డెన్‌లోని ఉసిరి చెట్లకు పూజలు చేసి రోజంతా సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలు చెట్లు, చెరువులు, ప్రకృతితో పండగలు ముడిపడి ఉన్నాయన్నారు. ఆ సంప్రదాయాలను భావితరాల వారికి తెలియజేయటంతో పాటు తప్పనిసరిగా జరుపుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందన్నారు. రోజంతా ఆట, పాటలు, పూజలతో గడిపి పసందైన వంటకాలతో భోజనాలు చేశామన్నారు.

మల్కంచెరువు మెరిసేదెప్పుడు..?

ప్రతిపాదనల్లోనే వీకెండ్‌స్పాట్‌



మల్కంచెరువు సుందరీకరణలో భాగంగా నిర్మించిన ఎంట్రెన్స్‌ ప్లాజా

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ రాయదుర్గంలోని మల్కంచెరువు సువిశాలంగా ఉండడం.. రోడ్‌ సైడ్‌ లేక్‌ కావడంతో దీన్ని వీకెండ్‌స్పాట్‌గా మార్చాలని గత ప్రభుత్వం అపర్ణా నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్‌ నిధులతో అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో మల్కం చెరువు సుందరీకరణకు పలు ప్రతిపాదనలు చేశారు. వాటిలో కొన్నింటిని మాత్రం అమలు చేశారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో వీకెండ్‌ స్పాట్‌ ప్రతిపాదన నిలిచిపోయింది. ముఖ్యంగా మల్కం చెరువు గొలుసుకట్టు చెరువు కావడంతో మాదాపూర్‌లోని దుర్గంచెరువు– మల్కంచెరువు రూట్‌ను కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. ఇది పూర్తయితే నగర ప్రజలకు చక్కని అనుభూతినిస్తుంది.

- మల్కంచెరువుకు 51.30 ఎకరాల స్థలం ఉండడంతో రూ.30 కోట్లతో మరింత అభివృద్ధి చేసి నగర శివారులో మరో వీకెండ్‌స్పాట్‌గా మార్చాలనే ప్రతిపాదనతోనే ప్రణాళికలు రూపొందించారు.
- కానీ ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి
- ముఖ్యంగా నీటిపారుదల విభాగం, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, శేరిలింగంపల్లి సర్కిల్‌ అధికారులు మారడంతో.. భవిష్యత్‌లో ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకుంటాయా అని స్థానికులు, సందర్శకులు సందేహం వెలిబుచ్చుతున్నారు.
- కానీ ప్రతిపాదనలన్నీ కార్యరూపందాలిస్తే శివారులో ఆకట్టుకునే, సేదతీరే ప్రదేశంగా మారడం ఖాయం. కాగా ఇప్పటి వరకు చేపట్టిన పనులతో ఈ చెరువు రూపురేఖలు మారిపోయాయి.

ప్రతిపాదనలకే పరిమితం..

- మల్కం చెరువు గొలుసుకట్టు చెరువు కావడంతో మాదాపూర్‌లోని దుర్గంచెరువు– మల్కం చెరువు రూట్‌ను కలిపేలా రోడ్డును ప్రతిపాదించారు. ఇది వాకింగ్‌, సైక్లింగ్‌, ట్రాఫిక్‌ నియంత్రణకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని భావించారు. కానీ అమలుకు నోచుకోలేదు.
- అర్ధచంద్రాకారంలో ఆంపీ థియేటర్‌, లేజర్‌ షోలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్థలం ప్రతిపాదించారు. కానీ ఏర్పాటు చేయలేదు.
- యోగాకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేక యోగా సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అది కాగితాలకే పరిమితమైంది.
- ఈ ప్రాంతంలో భారీ బండరాళ్లు ఉండడంతో రాక్‌ గార్డెన్‌, కేఫెటేరియా, వాటర్‌ ఫౌంటేన్లు, బోటింగ్‌ తదితరాలన్నీ అలాగే మిగిలిపోయాయి.
- ఇప్పటికైనా ప్రతిపాదనల అమలుకు ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ, నీటిపారుదల శాఖ అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపాలి

కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌



క్రిస్టినా జెడ్‌ చోంక్టుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపి అవసరమైన నిధులు విడుదల చేయాలని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. గురువారం తెలంగాణ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్‌ చోంక్టును కలిశారు. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రికి సరిపడా వైద్యులు, నర్సింగ్‌ సిబ్బంది లేరని ఆమె దృష్టికి తెచ్చారు. ఈ ఆసుపత్రిని వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా మార్చడం జరిగిందని అయితే దీనికి సరిపడా సంఖ్యలో వైద్యుల నియామకాలు జరగలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి ఇన్‌పేషంట్‌ విభాగం వంద శాతం ఆక్యుపెన్సీతో ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా గతంలో జరిగిన వైద్యుల బదిలీలలో గోల్కొండ ఆసుపత్రి నుంచి ఖాళీ అయిన స్థానాలు ఇంకా భర్తీ కాలేదని ఆయన అన్నారు. అసలే నగరంలో సీజనల్‌ వ్యాధులు పబలుతున్నాయని ఆసుపత్రిలో తగిన సంఖ్యలో వైద్యులు లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రి కొత్త బ్లాక్‌ కోసం నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ ఆసుపత్రికి కార్వాన్‌ నుంచే కాకుండా శివారు ప్రాంతాల ప్రజలు సైతం వస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా క్రిస్టినా జెడ్‌ చోంక్టు ఆసుపత్రి నూతన బ్లాక్‌ నిర్మాణానికి ఎనిమిది కోట్ల రూపాయలతో ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపించడం జరిగిందని ఆమె అన్నారు. అనంతరం ఆయన బల్దియా కమిషనర్‌ కె.ఇలంబర్తిని కలిశారు. వీడీసీసీ రోడ్ల మరమ్మతులు తదితర వాటికి పది కోట్ల రూపాయలు అవసరం అవుతాయని దీనిని వెంటనే విడుదల చేయాలన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు కార్వాన్‌ నియోజకవర్గంలోని రోడ్లు గుంతలమయంగా మారాయని రోడ్ల మరమ్మతులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. సంబంధిత జోనల్‌ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా బల్దియా కమిషనర్‌ ఆయనకు హామీ ఇచ్చారు.

దివ్యాంగుల పరికరాల కోసం 30న క్యాంపు

గోల్కొండ: దివ్యాంగులకు సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు ఈ నెల 30వ తేదీన అసెస్‌మెంట్‌ క్యాంపు నిర్వహిస్తున్నామని గుడిమల్కాపూర్‌ మాజీ కార్పొరేటర్‌ బంగారి ప్రకాష్‌ అన్నారు. గుడిమల్కాపూర్‌ ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటి వరకు సహాయ పరికరాలు లేని దివ్యాంగులు ఈ క్యాంపునకు రావాలని, వైద్యులు అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇతర వివరాలకు 9390386245లో సంప్రదించాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలుకు సమగ్ర సర్వే దోహదం

టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌

గోల్కొండ: సంక్షేమ పథకాల అమలుకు సమగ్ర కుటుంబ సర్వే దోహదపడుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బీ.మహేష్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే కార్వాన్‌ నియోజకవర్గంలో జరుగుతున్న విధానాన్ని కాంగ్రెస్‌ నాయకులు కురాకుల కృష్ణ బుధవారం ఆయనను కలిసి వివరించారు. ఈ సందర్భంగా బీ.మహేష్‌కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల్లో సమగ్ర కుటుంబ సర్వే ఒకటని టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల వారికి రుచించడం లేదని తెలిపారు. అందువల్లే తెలంగాణలో బీఆర్‌ఎస్‌, బీజేపీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు సృష్టించి ప్రజలను గందరగోళానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కురాకుల కృష్ణ, ఏ.చంద్రశేఖర్‌, రఘుపాల్‌రెడ్డి తదితరులున్నారు.